



# భక్తుల కొంగు బంగారం

# పులిచేరు కట్టమైసమ్మ

## కోరిన కోరికలు నెరవేర్చి మహిమలు చాటుకుంటున్న అమ్మవారు

కోరిన కోరికలు తీర్చే భక్తుల కొంగు బంగారంగా శ్రీశ్రీశ్రీ పులిచేరు కట్టమైసమ్మ అమ్మవారు విరాజిల్లుతోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్‌లో పులిచేరుకుంటపై వెలిసిన శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ అమ్మవారు తన మహిమలతో భక్తులను ఎంతగానో ఆకర్షిస్తోంది. అమ్మవారి కరుణా కటాక్షాలు అందరిపై ఉండడంతో భక్తులు తమ ఇష్ట దైవంగా కొలుస్తున్నారు. ఇక్కడి ప్రాంతం ఇలవేల్పుగా పూజలందుకుంటూ ఏ యేటి కాయేడు తన మహిమలతో అమ్మవారు తన సన్నిధికి భక్తులను రప్పించుకుంటోంది. నిత్యపూజలు, కైంకర్యాలు, అభిషేకాలు, నైవేద్యాలు అందుకుంటూ అమ్మవారు భక్తుల మన్ననలు చూరగొంటోంది. ప్రతి ఏటా పలు విధాలుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఇక్కడి దేవాలయంలో భక్తులు అంగరంగ వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారికి మహిళలు ఒడి బియ్యం సమర్పించడం ఇక్కడ ఆనవాయితీగా కొనసాగుతోంది. బోనాలు, పోతరాజుల నృత్యాలు, శివసత్తుల పూనకాలు, బతుకమ్మ ఆటలు, కోలాటాలు, డప్పుల దరువులతో ఇక్కడి ప్రాంతం ఉత్సవాల సమయంలో కోలాహలంగా మారుతోంది.



ఒకప్పుడు ఇక్కడ చిన్న గుడి మాత్రమే ఉండగా ప్రస్తుతం భక్తులు అతిపెద్ద ఆలయాన్ని నిర్మించారు. కోరిన కోరికలు నెరవేరడంతో కట్టమైసమ్మ తల్లికి భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటూ భక్తి పారవశ్యాన్ని చాటుకుంటున్నారు. అమ్మవారి దయ కారణంగా ఆలయ అభివృద్ధికి భక్తులు ముందుకు వస్తున్నారు. ఉత్సవాలు జరుగుతున్నప్పుడు భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయ అభివృద్ధికి భక్తులు తమవంతు కృషి చేసేందుకు ముందుకు రావాలని శ్రీ కట్టమైసమ్మ ఆలయ నిర్మాణం ఫౌండర్, చైర్మన్ మాడుగుల చంద్రారెడ్డి భక్తులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

-క్విక్ టుడే, పీర్జాదిగూడ



### ప్రతి మంగళవారం భజనలు

ఇక్కడి కట్టమైసమ్మ అమ్మవారి ఆలయంలో ప్రతి మంగళవారం రాత్రిపూట భజన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అమ్మవారి కీర్తిని పలువురు భక్తులు పాటలు పాడుతూ భక్తి పారవశ్యంలో మునిగిపోతున్నారు. అమ్మవారి అనుగ్రహం, కరుణాకటాక్షాలు భక్తులపై ఉండాలని వీరు తమ పాటల ద్వారా భక్తి శ్రద్ధలతో అమ్మవారిని వేడుకుంటున్నారు.

### బోనాల సంబురాలు

ప్రతి ఏటా ఆషాఢం, శ్రావణ మాసాల్లో అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి సంబురాలు జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఇక్కడి ఆలయం విద్యుద్దీపాలంకరణతో దేదీప్య మానంగా వెలుగులీనుతుంది. వర్షాకాలం అయినందున రోగాలు, వ్యాధుల బారినుంచి తమను కాపాడి చల్లగా చూడాలంటూ ఆ తల్లీ అంటూ భక్తులు వేడుకుంటారు.





### బతుకమ్మ ఆటపాటలు

ఆలయ ప్రాంగణంలో ప్రతి సంవత్సరం బతుకమ్మ ఉత్సవాలు అంగరంగవైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. పెత్తరామాస రోజున ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై సద్దుల బతుకమ్మ వరకు ఇక్కడ పండుగ సందడి నెలకొంటుంది. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ఆటాపాటలతో మహిళలు నృత్యాలు చేస్తూ ఆనందంగా గడుపుతారు.

### నవరాత్రి ఉ త్సవాలు

విజయ దశమి సందర్భంగా ఇక్కడి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతుంటాయి. అమ్మవారు తొమ్మిది రోజులపాటు ఒక్కో రూపంలో భక్తులకు దర్శనం ఇస్తుంటారు. భక్తులు ఈ నవరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తూ ఎంతో నిష్టతో నియమాలు పాటిస్తారు. ఉపవాస దీక్షలు, అమ్మవారి మాలాధారణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అన్నపూర్ణ దేవీ అలంకరణ రోజున భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.





### మాడుగుల చంద్రకళా చంద్రారెడ్డి దంపతుల ఎనలేని కృషి

పీర్జాదిగూడలోని 7వ డివిజన్‌లో పులిచేరుకుంట కట్టపై వెలిసిన కట్టమైసమ్మ ఆలయ నిర్మాణంలో కార్పొరేటర్ మాడుగుల చంద్రకళా చంద్రారెడ్డి దంపతుల కృషి ఎనలేనిది. వీరి సొంత నిధులతో ఆలయ నిర్మాణంలో ముఖ్య భూమిక పోషించారు. దీంతో 2021 ఆగస్టు 5న నూతన ఆలయం పునఃప్రారంభమైంది. అప్పటి నుంచి ఈ ఆలయంలో నిర్వహించే అన్ని కార్యక్రమాలను ఈ దంపతులు ముందుండి నడిపిస్తున్నారు. ఆ తల్లి అనుగ్రహం వల్ల అందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వార్యాలతో కొనసాగాలని వీరు కోరుకుంటున్నారు.

